క్షయ నివారణకు చర్యలు

మంచిర్యాల అర్బన్, మార్చి 24 : జిల్లాలో క్షయ నివారణకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు, ప్రజలందరికీ అవగాహన కల్గించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలకు ఆదేశాలు ఇచ్చినట్లు మంచిర్యాల జిల్లా వైద్యాధికారి హరీశ్ రాజ్ అన్నారు. ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా ప్రభుత్వ దవాఖాన నుంచి వైద్యులు, వైద్య సిబ్బందితో ర్యాలీ తీశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ఆధారంగా జిల్లా, రాష్ట్రంలో క్షయ నివారణకు, కేసులకు చికిత్సలో 80 శాతం కవరేజ్ మెరుగుపడిందన్నారు. ఈ ఏడాది క్షయను అంతం చేయవచ్చుననే నినాదంతో ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 2024లో 1278 కేసులు నమోదవగా, వారికి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. 871 మంది బాధితులకు మందులు, పౌష్టికాహారం అందించేందుకు ఒక్కొక్కరికీ నెలకు రూ.వెయ్యి చొప్పున అందించిస్తున్నట్లు వెల్లడించారు. వైద్యులు భీష్మ, శ్రీధర్, సుధాకర్ నాయక్, పీవో సురేందర్, డీపీఎంవో ప్రశాంతి, నాందేవ్, హెచ్‌వోలు అల్లాడి శ్రీనివాస్, డెమో వెంకటేశ్వర్లు, వైద్య కళాశాల విద్యార్థులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 23 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో వైద్యులు, సిబ్బంది అవగాహన ర్యాలీ తీశారు. డీఎంహెచ్‌వో సీతారాం పాల్గొని, మాట్లాడారు. క్షయ నిర్మూలనకు అందరి సహకారం అవసరమన్నారు. 2024లో జిల్లాలో 13,477 టెస్టులు చేసి, 989 మందిని, 2025లో 2,863 టెస్టులు చేసి, 209 మందిని గుర్తించి వైద్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం 546 యాక్టివ్ కేసులు ఉన్నాయన్నారు. వైద్యులు అజిముద్దీన్, పవన్ కుమార్ వైద్య సిబ్బంది ఉన్నారు.

చెన్నూర్ టౌన్, మార్చి 24 : చెన్నూర్ పట్టణంలో వైద్యులు, సిబ్బంది ఫ్లెక్సీలతో ప్రచారం చేశారు. దవాఖాన ఎదుట నినాదాలు చేశారు. డా. సత్య నారాయణ, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్ రూరల్, మార్చి 24 : చెన్నూర్ ప్రభుత్వ దవాఖానలో వైద్యుడు సత్యనాయణ ఆధ్వర్యంలో రోగులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ తీశారు. సిబ్బంది జగదీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, మార్చి 24 : వాంకిడి ప్రభుత్వ దవాఖాన నుంచి స్థానిక బస్టాండ్ వరకు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో కలిసి వైద్యుడు వినయ్ ఉప్రే ర్యాలీ తీశారు. వైద్యురాలు రిషిత, హెచ్ఈవో రవిదాస్, సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పునరుద్ధరణ త్వరగా పూర్తి చేయాలి

కాగజ్‌నగర్, మార్చి 24 : కాగజ్‌నగర్ పట్టణంలో కొనసాగుతున్న విద్యుత్ పునరుద్ధరణ పనులు త్వరగా పూర్తి చేయాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సిబ్బందికి సూచించారు. సోమవారం పనులను ఆమె పరిశీలించారు. పట్టణంలో ఎక్కడెక్కడ విద్యుత్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి.., ఎప్పటి వరకు పూర్తిచేస్తారని ఏఈ కమలాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పునరుద్ధరణ పూర్తి చేసి, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీ సాయి, లైన్‌మన్ కేదారి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

బెల్లంపల్లి, మార్చి 24 : సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కూరగాయల భవనంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఒక్క సీసీ కెమెరా వంద కండ్లతో సమానమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ దుకాణాలు, బస్తీల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏసీపీ రవికుమార్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య, ఎస్ఐ రాకేశ్, కూరగాయల మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

సీసీసీ నస్పూర్, మార్చి 24 : రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జీఎం (కార్పొరేట్) చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ జీఎం ఎం శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో రక్షణ చర్యలపై సమీక్షా సమాశం నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని భూగర్భ, ఉపరితల గనుల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలపై విస్తృతంగా చర్చించారు. బెల్లంపల్లి ఏరియా రక్షణ జీఎం రఘుకుమార్, ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ఓసీపీల పీవోలు శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, ఇన్‌చార్జి ఇంజినీర్ సాంబశివరావు, ప్రాజెక్ట్ ఇంజినీర్లు రామకృష్ణ, నాగరాజు, సీహెచ్‌పీ డీజీఎం చంద్రలింగం, అన్ని గనుల మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

నస్పూర్, మార్చి 24 : ప్రజావాణిలో అందిన దరఖాస్తులను అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి, మంచిర్యాల, నెన్నెల, భీమిని, సాలిగాం ప్రాంతాల నుంచి ప్రజలు దరఖాస్తులు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆర్డీవో శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో..

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 24 : కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కాగజ్‌నగర్ మండలం వంజరి గ్రామానికి చెందిన డోంగ్రి లింగయ్య.. తన భూమి నుంచి రైల్వే లైను వెళ్లినందున నష్టపరిహారం ఇప్పించాలని.., మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రావులపల్లి గ్రామానికి చెందిన సోదరి సమ్మయ్య.. తన కూతురు సిర్పూర్(టీ) గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతూ చనిపోయిందని, న్యాయం చేయాలని.., చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్‌కు చెందిన అజిత్ మేస్త్రి.. ఉపాధి హామీ కింద పశువుల పాక నిర్మించానని, 5 నెలలైనా బిల్లులు రాలేదని.., కౌటాల మండలం బాదంపల్లి గ్రామానికి చెందిన కొండగర్ల రాజ్ కుమార్.. దళితబంధు కింద రైస్‌మిల్లు నిర్మించుకున్నానని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని అర్జీలు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

కాసిపేట, మార్చి 24 : కాసిపేట మండలం కళ్యాణిఖని ఓపెన్ కాస్ట్ భూ నిర్వాసిత దుబ్బగూడెం గ్రామస్తులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ప్లాట్లు వెంటనే కేటాయించాలని ప్రజావాణిలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఓసీలో గ్రామం పోతుండగా, ఇప్పటి వరకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ప్లాట్లు కేటాయించలేదని, దీంతో ఓసీపీలో పేలుళ్ల వల్ల ఇండ్లు కూలిపోతున్నాయని పేర్కొన్నారు. శ్రీనివాస్, బూర్గుపల్లి రమేశ్, నాగపూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాసిపేట, మార్చి 24 : ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగులకు రూ.6,016 పింఛన్ పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు వెంటనే పెంచాలని తెలంగాణ దివ్యాంగుల ఐక్య వేదిక అధ్యక్షుడు నగురారపు సుమన్ తెలంగాణ దివ్యాంగుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే దీక్షలు చేపడుతామని తెలిపారు.

చెన్నూర్ టౌన్, మార్చి 24 : చెన్నూర్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణికి రెండు అర్జీలు వచ్చినట్లు ఎంపీవో ఎండీ అజ్మత్ అలీ తెలిపారు. పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాసిపేట, మార్చి 24 : కాసిపేట ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణికి మండల పరిషత్‌కు సంబంధించి 2, రెవెన్యూ శాఖకు సంబంధించి 3 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ భోజన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీనారాయణ, ఏవో చల్ల ప్రభాకర్, పశు వైద్యాధికారిని సరిత పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారుల ఆలస్యం

మందమర్రి రూరల్, మార్చి 24 : మందమర్రి మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో నేటి వరకు భూ తగాదాలకు సంబంధించి 7 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సతీశ్ కుమార్ తెలిపారు. మందమర్రి, రామకృష్ణాపూర్ ఎస్ఐలు ఎస్ రాజశేఖర్, జీ రాజశేఖర్ పాల్గొన్నారు.

జన్నారం, మార్చి 24 : మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన రైతులు దుబ్బయ్య, సత్యరాయణ.. తమ తాతలు, తండ్రుల నుంచి సంక్రమించిన సర్వే నంబర్ 18లోని భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారు. ఏడాది నుంచి కలెక్టర్, ఆర్డీవో, తహసీల్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు.

తాండూర్, మార్చి 24 : తాండూర్ తహసీల్ కార్యాలయంలో పరిష్కార వేదికలో 5 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు. మాదారం ఎస్ఐ సౌజన్య, డీటీ వీవీఆర్‌కేడీ ప్రసాద్ పాల్గొన్నారు.

వేమనపల్లి, మార్చి 24 : వేమనపల్లిలో తహసీల్ కార్యాలయంలో భూ సమస్యలపై రెండు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కొండ రవి, కల్మపేట గ్రామానికి చెందిన నాగుల సుశీల అర్జీలు సమర్పించినట్లు పేర్కొన్నారు.

హాజీపూర్, మార్చి 24 : హాజీపూర్‌లో మండల కమిటీ ఆధ్వర్యంలో మూడు సమస్యలను పరిష్కరించినట్లు తహశీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్ పాండే తెలిపారు. వారం నుంచి నిర్వహిస్తున్న ప్రజావాణిలో 12 దరఖాస్తులు వచ్చాయని, 3 పరిష్కరించామని పేర్కొన్నారు. ఎస్ఐ గోపతి సురేశ్, తహసీల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారుల ఆలస్యం

భీమారం, మార్చి 24 : భీమారం ఎంపీడీవో కార్యలయంలో ప్రజావాణికి అధికారులు సమయానికి రాకపోవడంతో ఆలస్యమైంది. ఎంపీడీవో మధుసూదన్, ఎంపీవో సతీశ్‌రెడ్డి 10:30కి ముందుగానే కార్యాలయానికి చేరుకున్నారు. ఐకేపీ ఏపీఎం 10:48.., ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ 10:49.., తహశీల్దార్ సదానందం 10:53.., ఎస్ఐ శ్వేత 11:15.., ఏవో సూధాకర్ 11:56కి వచ్చారు. కాగా, పదోతరగతి పరీక్షా కేంద్రాల సందర్శనకు వెళ్లినట్లు తహసీల్దార్ సదానందం తెలిపారు. మొత్తంగా 4 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో మధుసూదన్ తెలిపారు.

వడదెబ్బ నుంచి కాపాడుకోవాలి

పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

నస్పూర్, మార్చి 24 : వేసవి దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురవకుండా కాపాడుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో హరీశ్‌రావుతో కలిసి సమావేశం నిర్వహించారు. ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బకు గురైన వారిని రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది వడదెబ్బ నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించాలన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. అధికారులు రౌఫ్‌ఖాన్, వెంకటేశ్వర్‌రావు, రవీందర్‌రెడ్డి, కిసన్, పురుషోత్తం నాయక్, తిరుపతి, సుధాకర్ నాయక్, సీతారామరాజు, అనిల్, సుమన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'పది' పరీక్షా కేంద్రాల్లో తనిఖీ..

నస్పూర్‌లోని ఆక్స్‌ఫర్డ్, సింగరేణి ఉన్నత పాఠశాల, తీగల్‌పహాడ్ జడ్పీ పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ కుమార్ దీపక్ తనిఖీ చేశారు. కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. డీఈవో ఏడు, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు 19 కేంద్రాలను సందర్శించాయి.

క్షయ నిర్మూలనకు చర్యలు..

జిల్లాలో క్షయ నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. 'అవును మనం టీబీని అంతం చేద్దాం' నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5 ట్రీట్‌మెంట్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 10 మంది బాధితులకు హిందూ సేవక్ సమాజ్ మంచిర్యాల, పెన్నిటి వలంటరీ ఆర్గనైజేషన్ సంస్థ సహకారంతో పౌష్టికాహారం కిట్లు అందించినట్లు తెలిపారు. ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, రౌఫ్‌ఖాన్, వెంకటేశ్వర్‌రావు, రవీందర్‌రెడ్డి, కిసన్, పురుషోత్తంనాయక్, తిరుపతి, ఆర్ఎంలు భీష్మ, పోగ్రాం అధికారి సుధాకర్‌నాయక్, వైద్యులు అనిత, సీతారామారాజు, కోటేశ్వర్‌రావు, అనిల్, హరిశ్చంద్రారెడ్డి, ప్రశాంతి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై విస్తృత ప్రచారం చేయాలి

వాంకిడి, మార్చి 24 : లే అవుట్ భూముల క్రమబద్ధీకరణలో భాగంగా ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లింపులపై ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్ఆర్ఎస్-2020లో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారులు 31వ తేదీలోగా రుసుము చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 100 శాతం చెల్లించిన వారికి 25 శాతం మినహాయింపు ఉందని, ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇంటి పన్ను 100 శాతం వసూలు చేయాలని, గ్రామపంచాయతీల్లో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని, గ్రామమంతా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వేసవిలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. అనంతరం వాంకిడి పీహెచ్‌సీని సందర్శించారు. వార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన హెడ్ నర్సుకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని అధికారులను ఆదేశించారు. వ్యాక్సినేషన్ సెంటర్‌ను తనిఖీ చేసి, పిల్లలకు క్రమం తప్పకుండా అందించాలని, గర్భిణులకు ప్రతి నెలా పరీక్షలు సక్రమంగా చేయాలని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే జడ్పీహైస్కూల్‌లో 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. 100 శాతం విద్యార్థుల హాజరు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, వైద్య సిబ్బంది, ఇంజినీర్లు, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవాలి

జన్నారం, మార్చి 24 : ప్రతి ఒక్కరూ జీవిత, ప్రమాద, ఆరోగ్య బీమా చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ దముక ప్రభుదాస్ సూచించారు. దేవునిగూడ గ్రామానికి చెందిన అజ్మీరా రాంసింగ్ గతేడాది అనారోగ్యంలో మృతి చెందాడు. కాగా, అతడు కిష్టాపూర్ బ్రాంచ్‌లో బీమా చేసుకోగా, రూ.10 లక్షలు మంజూరైంది. అతడి భార్య అజ్మీరా రంగికి సోమవారం చెక్కును అందజేశారు. టీజీబీ సీనియర్ రవికుమార్, ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ సమీర్, కిష్టాపూర్ బ్రాంచ్ మేనేజర్ రమణ చైతన్య, ఏపీఎం బుచ్చన్న, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించలేదని అటవీశాఖ కార్యాలయానికి తాళం

తాళం వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

చెన్నూర్ టౌన్, మార్చి 24 : చెన్నూర్ పట్టణంలోని అటవీశాఖ కార్యాలయానికి మున్సిపల్ అధికారులు సోమవారం తాళాలు వేశారు. ఎనిమిదేళ్లుగా మున్సిపల్ ట్యాక్స్ కట్టడంలేదని ఫారెస్ట్ ఆఫీస్‌ను సీజ్ చేశారు. అటవీశాఖ కార్యాలయ అధికారులకు రెడ్ నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో, ఫారెస్టుకు సంబంధించిన కార్యాలయాలకు తాళం వేసినట్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. బకాయి ఉన్న రూ.3.43 లక్షలు త్వరగా చెల్లించాలని కోరారు. దీంతో సిబ్బంది బయట విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీశాఖ కార్యాలయాన్ని మున్సిపల్ సిబ్బంది సాయంత్రం తెరిచారు. తాళం తీసివేశారు.

అర్థిక సాయం

సాయం అందిస్తున్న అధ్యక్షుడు ఎస్ మల్లేశ్

జన్నారం, మార్చి 24 : మండలంలోని చింతలపల్లె గ్రామానికి చెందిన విద్యార్థి వాసాల అరవింద్ ఈ నెల 19న కరీంనగర్ జిల్లాలోని కాకతీయ కాలువలో పడిమృతిచెందాడు. కాగా, బాధిత కుటుంబాన్ని జిల్లా పద్మశాలి ట్రస్ట్ అధ్యక్షుడు స్వర్గం మల్లేశ్, ప్రధాన కార్యదర్శి ఏ భద్రయ్య పరామర్శించారు. రూ.15 వేల సాయం అందజేశారు. పద్మశాలి పట్టణ అధ్యక్షుడు చెట్‌పెల్లి కృష్ణ, రమేశ్, రాజమౌళి, భాస్కర్ పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

బెజ్జూర్, మార్చి 24 : మండలంలోని ముంజంపల్లి, లంబాడిగూడ, బారెగూడలో గల నాటుసార స్థావరాలపై సోమవారం ఎక్సైజ్ సీఐ రవి ఆధ్వర్యంలో దాడులు చేశారు. 25 లీటర్ల గుడుంబా, 200 లీటర్ల బెల్లం పానకాన్ని పట్టుకున్నారు. అలాగే ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అనంతరం తొమ్మిది మంది పాత నేరస్తులను మండల కేంద్రంలోని డీటీ భీమ్లా నాయక్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

భార్యాభర్తలకు ఆరు నెలల జైలు

బెల్లంపల్లి, మార్చి 24 : బెల్లంపల్లి పట్టణం బజార్ ఏరియా ముఖేశ్ డ్రెస్సింగ్‌లో దొంగతనానికి పాల్పడిన హన్మాన్‌బస్తీకి చెందిన భార్యభర్తలు అస్పీయా షేరిన్, ఎండీ బద్రుద్దీన్‌కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు, రూ.50 జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ముఖేశ్ సోమవారం తీర్పునిచ్చినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. 2022, నవంబర్ 6న రాత్రి దుకాణం తాళాలు పగులగొట్టి 250 గ్రాముల బంగారు బిస్కెట్లు, రెండు మొబైల్ ఫోన్లు, రూ.5వేలు దొంగిలించారు. యజమాని పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్‌హెచ్‌వో ముష్కే రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఎండీ బద్రుద్దీన్, అస్పీయా షేరిన్‌ను కోర్టులో హాజరు పర్చారు. ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి విచారించగా, నేరం రుజువైందని ఎస్‌హెచ్‌వో వెల్లడించారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

బెల్లంపల్లి, మార్చి 24 : గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను సోమవారం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో దేవయ్య వివరాలు వెల్లడించారు. హన్మాన్‌బస్తీకి చెందిన తాజ్‌బాబా, షంషీర్‌నగర్‌కు చెందిన ఇర్ఫాన్ బాబా షేక్, తాండూర్ మండలం రాజీవ్‌నగర్‌కు చెందిన వాసాల గిల్‌క్రిస్ట్, కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన సంతోష్ సమ్రూడ్ జాదవ్ గంజాయి వ్యసనానికి బానిసయ్యారని తెలిపారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి తాగుతుంటారన్నారు. మిగిలిన గంజాయిని స్థానికంగా అధిక ధరతో విక్రయించేవారని పేర్కొన్నారు. ముందస్తు సమాచారం మేరకు కన్నాలబస్తీలో దాడులు చేసి, అదుపులకి తీసుకున్నట్లు, కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో వెల్లడించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

కౌటాల, మార్చి 24 : క్రీడల్లో గెలుపోటములు సహజమని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజన్ పేర్కొన్నారు. కౌటాల మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో కేపీఎల్ (కౌటాల ప్రీమియర్ లీగ్) సీజన్-1 ఫైనల్‌లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందచేశారు. స్ట్రైరింగ్ పంప్ గేమ్ చేంజర్స్ విన్నర్(రూ.లక్ష, షీల్డ్)గా, ఎస్ఎన్‌టీఎన్ సూపర్ కింగ్స్ రన్నర్ (రూ.50 వేలు షీల్డ్)గా నిలిచారు. ఎస్ఐ మధుకర్, ఎంపీడీవో ప్రసాద్, మాజీ ప్రజాప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

బోరు నిర్మాణానికి భూమి పూజ

తాండూర్, మార్చి 24 : స్థానిక పోచమ్మ ఆలయ ఆవరణలో సోమవారం మాజీ ఎంపీటీసీ సూరం రవీందర్ రెడ్డి బోరు నిర్మాణానికి భూమి పూజ చేశారు. మాజీ సర్పంచ్ కాపర్తి సుభాష్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ సూరం దామోదర్ రెడ్డి, నాయకులు పుట్ట శ్రీనివాస్, కృష్ణపెళ్లి లక్ష్మణ్, మందపు రామారావు, వెంకన్న, బానేశ్, తోట శ్రీనివాస్, కిషన్, శివరావు, రమేశ్, రవి, మల్లేశ్, విజయ్ పాల్గొన్నారు.

బోరుకు భూమి పూజ చేస్తున్న సూరం రవీందర్ రెడ్డి

రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

కోటపల్లి పోలీస్టేషన్‌ను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

కోటపల్లి, మార్చి 24 : తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. సోమవారం కోటపల్లి పోలీస్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. సరిహద్దు గ్రామాల పరిస్థితి, పక్క రాష్ట్రంలో మావోయిస్టుల కదలికలపై ఆరా తీశారు. మండలంలోని మాజీ మావోయిస్టులు, మావోయిస్టు సానుభూతిపరుల వివరాల గురించి తెలుసుకున్నారు. పోలీస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని, పోలీసులంటే ప్రజలకు నమ్మకం, భరోసా కల్పించేలా విధులు నిర్వహించాలని సూచించారు. స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావ్, ఎస్ఐబీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతితో మరింత బాధ్యత..

మంచిర్యాల అర్బన్, మార్చి 24 : ఉద్యోగోన్నతితో మరింత బాధ్యత పెరుగుతుందని సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం కమిషనరేట్ పరిధిలో హెడ్‌కానిస్టేబుళ్లుగా పని చేస్తూ ఏఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం పాల్గొన్నారు.

నిరంతరం నిఘా పెట్టాలి..

వేమనపల్లి, మార్చి 24 : సరిహద్దున మహారాష్ట్ర ఉన్నందున మావోయిస్టుల కదలికలపై నిరంతరం నిఘా పెట్టాలని సీపీ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. సోమవారం నీల్వాయి పోలీస్టేషన్‌ను ఆయన మొదటిసారి సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేందర్‌రావు, ఎస్ఐబీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ ఉన్నారు.

కన్నెపల్లి పోలీస్టేషన్ తనిఖీ..

కన్నెపల్లి, మార్చి 24 : కన్నెపల్లి పోలీస్టేషన్‌ను సీపీ అంబర్ కిశోర్ ఝా సోమవారం ఆ